
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 18 । జూన్ । 2024



యాప్‌లో ‘వాతావరణం’
వర్షాలు, పిడుగుపాటుతో ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా వాతావరణాన్ని ముందే అంచనా వేసే యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి.
8లో



టేకు కలప తరలింపు
గుండాల మండల అటవీ అధికారులు కలప తరలిస్తుండగా ఇల్లెందు అటవీ అధికారులు అడ్డుకున్న ఘటన చోటు చేసుకుంది.
8లో

గరిష్టం / కనిష్టం
36° / 26°

వాతావరణం
జిల్లాలో మంగళవారం ఎండ ప్రభావం అధికంగానే ఉంటుంది. కొన్నిచోట్ల చిరు జల్లులు పడినా.. రాత్రికి ఉక్కపోత వాతావరణమే ఉంటుంది.

న్యూస్‌రీల్

రామాలయంలో సుదర్శన హోమం

స్వామివారికి ముత్తంగి అలంకరణ



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో సోమవారం చిత్తా నక్షత్రం సందర్భంగా సుదర్శన హోమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని యాగశాలలో ప్రత్యేక పూజలు చేశారు. కాగా సోమవారాన్ని పురస్కరించుకుని స్వామివారిని ముత్తంగి రూపంలో అలంకరించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుకలో 107 జంటలు పాల్గొనడం విశేషం.

ఐటీడీఏ ఆధ్వర్యంలోనే నియామకాలు చేపట్టాలి

చర్ల: ఏజెన్సీ ప్రాంతాల్లోని అన్ని శాఖల్లో ఐటీడీఏ ద్వారానే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ ఇరపా రాజు డిమాండ్ చేశారు. సోమవారం చర్లలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో ఉద్యోగ నియామకాల విషయంలో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలగాణా రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 5వ షెడ్యూల్ భూభాగంలోని క్లాజ్ 1 ప్రకారం స్థానిక ఆదివాసీలతోనే ఉద్యోగ భర్తీలు నిర్వహించాల్సి ఉన్నా.. ప్రస్తుతం ఆ పద్ధతి కొనసాగడం లేదని, ఆదివాసీలకు దక్కాల్సిన ఉద్యోగాలన్నీ జనరల్ నోటిఫికేషన్‌తో మైదాన ప్రాంత వాసులకు ఇస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఈ నెల 29న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించనున్నామని, ఆదివాసీ నిరుద్యోగులంతా తరలిరావాలని కోరారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళిక



అధికారులతో సమీక్షిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

మధిర: మధిర నియోజకవర్గంలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడం ద్వారా సమీప గ్రామస్తులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించినట్లు మధిర రేంజ్ అటవీ శాఖ అధికారి విజయలక్ష్మి తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఎర్రుపాలెం మండలంలో ఉన్న ఇనిద్రమ్మ చెరువు, జమలాపురం ఆలయ సమీపాన అర్బన్ పార్క్ తదితర ప్రాంతాలను పరిశీలించినట్లు ఆమె వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లో పెరుగుతున్న మొక్కలు, నీటి లభ్యత తదితర అంశాలతో నివేదికను జిల్లా అటవీ శాఖాధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, ఖమ్మం డివిజన్ అధికారి మంజులతో కలిసి సోమవారం ఖమ్మంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు అందజేసినట్లు తెలిపారు.

డయాలసిస్ సేవల పునరుద్ధరణ



డయాలసిస్ చేస్తున్న వైద్యులు

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో డయాలసిస్ సేవలు సోమవారం రాత్రి మొదలయ్యాయి. గత శనివారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో వచ్చిన వానకు షార్ట్ సర్క్యూట్ ఏర్పడి పరికరాలు కాలిపోగా, ఐదు మిషన్లు మొరాయించాయి. దీంతో డయాలసిస్ అవసరమైన వారిని ఖమ్మం, మహబూబాబాద్, అశ్వారావుపేట ఆస్పత్రులకు పంపించారు. ఫలితంగా వారం పాటు వారు అవస్థ పడాల్సి వచ్చింది. ఈ నేపథ్యాన మరమ్మతులు పూర్తికావడంతో సోమవారం రాత్రి నుంచి డయాలసిస్ సేవలు ప్రారంభమయ్యాయని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హర్షవర్ధన్ తెలిపారు.

వనరులు ఇక్కడ.. సాగు అక్కడ

సీతారామ ప్రాజెక్టుతో జిల్లాకు దక్కని న్యాయం

- భద్రాచలం, ఇల్లెందు నియోజకవర్గాలకు మొండిచేయి
- పినపాక, కొత్తగూడెంలో నామమాత్రపు సాగు
- అశ్వారావుపేటకు మాత్రమే గరిష్ట స్థాయిలో లబ్ధి



అశ్వాపురం మండలంలో నిర్మించిన సీతారామ పంప్‌హౌస్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ‘తలాపున గోదావరి పారుతున్నా మన చేను చెలక ఎడారే’ అనే పరిస్థితి జిల్లాకు మరి కొంతకాలం తప్పేలా లేదు. బహుళార్థ సాధక ప్రాజెక్టుగా నిర్మిస్తున్న సీతారామతో జిల్లా ప్రజలకు ఒనగూరే ప్రయోజనం అంతంత మాత్రంగానే ఉంది. ఈ ప్రాజెక్టు డిజైన్ కారణంగా జిల్లాలోని అశ్వారావుపేట నియోజకవర్గానికి మాత్రమే చెప్పుకోదగిన స్థాయిలో లబ్ధి చేకూరుతోంది. మిగిలిన నాలుగు నియోజకవర్గాలకు తీవ్ర అన్యాయమే జరుగుతోంది.

వనరులన్నీ ఇక్కడే..

సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన గోదావరి నది ములుగు జిల్లా గుండా ఈ జిల్లాలో ప్రవేశించి, భద్రాచలం పట్టణం దగ్గర ఏపీలోకి వెళ్తుంది. మార్గమధ్యంలో దుమ్ముగూడెం వద్ద నిర్మించే సీతమ్మసాగర్ బ్యారేజ్ దగ్గర నీటిని ఒడిసి పట్టుకుని హెడ్ రెగ్యులేటరీ, ప్రధాన కాలువలు, పంప్‌హౌస్‌ల ద్వారా ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని 6.74 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో కొత్త ఆయకట్టు 3.28 లక్షల ఎకరాలు ఉండగా పాత ఆయకట్టు స్థిరీకరణ 3.46 లక్షల ఎకరాలుగా ఉంది. కాగితాలపై ఈ పథకం ఘనంగా కనిపిస్తున్నా.. క్షేత్రస్థాయిలో భద్రాద్రి జిల్లాకు తీవ్ర అన్యాయం జరుగుతోంది.

బాధితులు ఇక్కడి వారే..

భూ నిర్వాసితులు, ముంపు బాధితులు ఈ జిల్లాలో ఉండగా ప్రధాన ఆయకట్టంతా ఖమ్మం జిల్లాలోకే వస్తోంది. భద్రాద్రి జిల్లా నుంచి అధికారిక లెక్కల ప్రకారమే 6,773 ఎకరాల భూమి సేకరించారు. దీంతో ఎంతో మంది రైతులు సాగు భూములను కోల్పోయారు. విలువైన అటవీ ప్రాంతాన్నీ నష్టపోవాల్సి వచ్చింది. బ్యాక్ వాటర్ కారణంగా దుమ్ముగూడెం, చర్ల, అశ్వాపురం, మణుగూరు మండలాల్లో 50కి పైగా గ్రామాలకు ముంపు సమస్య ఎదురుకానుంది. మరోవైపు సీతమ్మ సాగర్ బ్యారేజ్ నిర్మిస్తున్న భద్రాచలం నియోజకవర్గంలో ఈ ప్రాజెక్టు ద్వారా ఒక్క ఎకరానికి కూడా సాగు నీరు అందడం లేదు. అంతకుముందు ఈ ప్రాజెక్టులో కీలకంగా ఉన్న ఇల్లెందు నియోజకవర్గంలోని రెండు మండలాలకు అందుతున్న నీరు 3,679 ఎకరాలే. ఇక ప్రధాన కాలువ, పంప్‌హౌస్‌లు ఉన్న పినపాక నియోజకవర్గంలో 18,118 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందనుంది.

‘పేట’కు దక్కిన న్యాయం

ప్రాజెక్టు కారణంగా భారీగా నష్టపోయిన భద్రాద్రి జిల్లాకు సీతారామతో అందే సాగునీరు కేవలం రెండు లక్షల ఎకరాలే. అంటే మొత్తం సాగు విస్తీర్ణంలో జిల్లా వాటా 25 శాతానికే పరిమితమైంది. ఇందులోనూ కొత్త ఆయకట్టు 1.57 లక్షల ఎకరాలు కాగా, పాత ఆయకట్టు స్థిరీకరణ 42,930 ఎకరాలుగా ఉంది. జిల్లా వాటాగా చూపిస్తున్న రెండు లక్షల ఎకరాల్లో ఒక్క అశ్వారావుపేట నియోజవకర్గంలోనే 1,39,176 ఎకరాలుగా ఉంది. సీతారామ ప్రాజెక్టు వల్ల భద్రాచలం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో కనీసం ఒక్క ఎకరానికి కూడా నీరు అందడం లేదు.

ఆయకట్టు అంతంతే..

సీతారామ ప్రాజెక్టుతో సాగునీరు అందే పాత, కొత్త ఆయకట్టు వివరాలను పరిశీలిస్తే పినపాక నియోజకవర్గం పరిధిలో 17,118 ఎకరాలు, కొత్తగూడెం నియోజకవర్గంలో 40,536 ఎకరాలు ఉండగా ఇల్లెందులో 3,679 ఎకరాలకే పరిమితమైంది. ఇందులో కొత్త ఆయకట్టు కేవలం 175 ఎకరాలే కావడం గమనార్హం. గార్ల, కామేపల్లి మండలాల్లో కొంత ఆయకట్టు ఉన్నా అవి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లా పరిధిలోకి వెళ్తున్నాయి. అంతేకాదు జిల్లా పరిధిలో చూపిస్తున్న రెండు లక్షల ఎకరాల్లో వైరా నియోజకవర్గంలోని జూలూరుపాడు మండలంలో 20,792 ఎకరాలు ఉంది.

ఆనాటి ఆకాంక్షలు ఏవి..?

నీళ్లు, నిధులు, నియామకాలే ప్రధాన అంశంగా తెలంగాణ ఉద్యమం జరిగింది. ప్రతీ నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు నీరు అందిస్తామని అప్పటి ప్రభుత్వం చెప్పింది. అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్ పథకాలను కలుపుతూ సీతారామ ప్రాజెక్ట్ చేపట్టారు. అయితే ఇందులో కేవలం అశ్వారావుపేటను మినహాయిస్తే ఏ ఒక్క నియోజకవర్గానికీ ఆశించిన స్థాయిలో సాగునీరు అందే పరిస్థితి లేదు.

నియోజకవర్గం	కొత్త ఆయకట్టు	పాత ఆయకట్టు	మొత్తం
భద్రాచలం	0	0	0
ఇల్లెందు	174	3,505	3,679
పినపాక	15,665	1,453	18,118
కొత్తగూడెం	35,082	5,454	40,536
అశ్వారావుపేట	1,06,653	32,523	1,39,176
మొత్తం	1,57,574	42,935	2,00,509

ఫిర్యాదులు 35.. పరిష్కారం 13

జిల్లాలోని విద్యుత్ కార్యాలయాల్లో ప్రారంభమైన ప్రజావాణి



గండుగులపల్లిలో విద్యుత్ సమస్యపై దరఖాస్తు స్వీకరిస్తున్న అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం జిల్లాలోని విద్యుత్ కార్యాలయాల్లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. డివిజన్, సబ్ డివిజన్, ఏఈ కార్యాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు, జిల్లా సర్కిల్ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజావాణి నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల విద్యుత్ సమస్యలపై 35 దరఖాస్తులు రాగా, 13 ఫిర్యాదులను అధికారులు అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన 22 దరఖాస్తుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని విద్యుత్ ఎస్ఈ బి.భీకంసింగ్ తెలిపారు. జిల్లాలోని 30 సెక్షన్ కార్యాలయాలు, ఆరు ఈఆర్‌ఓ కార్యాలయాలు, 9 సబ్ డివిజన్ కార్యాలయాలతో పాటు జిల్లా సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం కొనసాగింది.

ఫిర్యాదుల్లో కొన్ని ఇలా..

- తన ఇంటి వద్ద శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభం ఉందని, ప్రమాదకరంగా ఉన్న ఆ స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేయాలని అశ్వారావుపేటకు చెందిన పెదమల్ల పుల్లారావు వినతిపత్రం అందించారు.
- తమ ఇంటివద్ద కేబుల్ డ్యామేజ్ అయిందని, ప్రమాదకరంగా ఉన్నందున వెంటనే చర్యలు చేపట్టాలని అశ్వారావుపేటకు చెందిన భీమాల సుజాత కోరారు.
- అశ్వారావుపేట సెక్షన్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉందని, ప్రమాదాలకు అవకాశం ఉన్నందున ఎక్కువ ఎత్తులో ఏర్పాటు చేయాలని మండల కేంద్రానికి చెందిన మన్మథరావు దరఖాస్తు చేశారు.
- తమ పామాయిల్ తోటలో విద్యుత్ లైన్‌లు కిందకు ఉన్నాయని, మరో స్తంభం ఏర్పాటు చేసి తీగల ఎత్తు పెంచాలని రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఓ రైతు వినతి పత్రం అందించారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

మహ్మద్ ప్రవక్త త్యాగనిరతికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను జిల్లా వ్యాప్తంగా సోమవారం ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మసీదులు, ఈద్గాలలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పేదలకు దాన ధర్మాలు చేశారు. తీపి వంటకాలను పంచిపెట్టారు. ముస్లిం మత పెద్దలు బక్రీద్ విశిష్టతను వివరించారు. జిల్లాలోని పలు పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు సైతం ప్రార్థనా మందిరాలను సందర్శించి ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

- మరిన్ని ఫొటోలు 9లో



బూర్గంపాడులో ప్రార్థన చేస్తున్న ముస్లింలు

చినుకు జాడేది..

- మబ్బులే తప్ప వర్షం పడని వైనం
- జూన్‌లోనూ తప్పని ఉక్కపోత
- ఎంతకీ తగ్గని పగటి ఉష్ణోగ్రతలు



జనసంచారం కనిపించని కొత్తగూడెంలోని ప్రధాన రహదారి

చుంచుపల్లి: వానాకాలం వచ్చినా మబ్బులే తప్ప చినుకు జాడ లేదు. ప్రస్తుతం జిల్లాలో విభిన్న వాతావరణం నెలకొంది. అటు వ్యవసాయానికి అవసరమైన వర్షాలు కురవకపోవడంతో రైతులు కొంతమేర ఆందోళనలో ఉన్నారు. అసలైన తొలకరి పలకరింపు కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. గతేడాది జూన్‌లో ఒక మోస్తారుగా వర్షాలు పడ్డాయి. ఆరంభంలోనే వరుణుడు కొంత కరుణించడంతో రైతులు ఉత్సాహంగా ఖరీఫ్ సాగు పనులు చేపట్టారు. కానీ.. ఈ ఏడాది వరుణుడి జాడే కనిపించడం లేదు. జూన్ మూడో వారం వచ్చినా నైరుతి రుతుపవనాల ప్రభావం ఎక్కడా కానరావడం లేదు. వర్షాలతో చల్లబడాల్సిన వాతావరణం భానుడి భగభగలతో మండిపోతోంది. ఏప్రిల్, మే నెలల్లో సూర్యప్రతాపంతో అల్లాడిన ప్రజలు.. జూన్‌లో వర్షాలతో కొంత సేదతీరొచ్చని ఆశించారు. కానీ అది నిరాశే అవుతోంది. దట్టమైన మబ్బులు పడుతున్నా గాలి దుమారంతో కూడిన చిరుజల్లులే పడుతున్నాయి తప్ప ఇప్పటివరకు భారీ వర్షం నమోదైన దాఖలాలు లేవు. అయితే రోజురోజుకూ ఉష్ణోగ్రతలు మళ్లీ పెరుగుతున్నాయి. మండే ఎండలకు ఉక్కపోత తోడవడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు పెరగడమే కాక రాత్రి పూట కూడా వాతావరణం వేడిగానే ఉంటోంది. దీంతో ఏసీలు, కూలర్ల వినియోగం ఇంకా కొనసాగుతూనే ఉంది. జూన్ తొలి వారంలోనే వర్షాలు ప్రారంభమై రెండో వారం నాటికి వాతావరణం పూర్తిగా చల్లబడాలి. కానీ ఇప్పటికీ సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తూనే ఉన్నాడు. జిల్లాలో సోమవారం 39.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అటు గాలిలో తేమ 70 శాతం వరకు ఉండడంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. మరో వారం రోజుల పాటు ఇవే ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో ఆందోళన చెందుతున్నారు. మృగశిర కార్తెకు ముందు రెండు రోజులు మాత్రం ఉరుములు, మెరుపులతో కొంత ఆశలు రేకెత్తించాయి. అయితే అంతలోనే గాలులు వీయడంతో మేఘాలు తేలిపోయాయి. ఆ తర్వాత రోజూ ఇవే పరిస్థితులు నెలకొంటున్నాయి.

‘ఇంటిగ్రేటెడ్’ ఇంకెన్నాళ్లో..?

- నిలిచిన మార్కెట్ నిర్మాణాలు
- జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో రూ.4.50 కోట్లతో పనులు
- 2022లో ప్రారంభమైనా ఇంకా రూఫ్ లెవల్‌లోనే..
- బిల్లులు విడుదల కాకపోవడమే అసలు సమస్య



పాల్వంచలో నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్

పాల్వంచ: రోజురోజుకూ విస్తరిస్తున్న పట్టణాల్లో ట్రాఫిక్ సమస్యలు అధిగమించడంతో పాటు అన్ని రకాల వెజ్, నాన్ వెజ్ విక్రయాలు ఒకేచోట ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రారంభించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో 2022లో పనులు మొదలుపెట్టగా సక్రమంగా బిల్లులు రాకపోవడంతో ఎక్కడివక్కడే ఆగిపోయాయి. ఈ పనులు ఇంకెప్పుడు పూర్తవుతాయోనని చిరు వ్యాపారులు ఎదురుచూస్తున్నారు. నూతన నిర్మాణాల పేరుతో గతంలో ఇక్కడ కూరగాయాలు అమ్మే షాపులను ఖాళీ చేయించారు. వారికి సరైన నీడ లేక ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. రోడ్ల పక్కనే వ్యాపారాలు చేసుకోవాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా వైకుంఠధామాల నిర్మాణాలు సైతం పూర్తయి రెండేళ్లు కావస్తున్నా నేటికీ బిల్లులు విడుదల కాలేదు.

నాలుగు చోట్లా ఇదే పరిస్థితి..

జిల్లాలోని పాల్వంచ, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు మున్సిపాలిటీల్లో ప్రభుత్వం రూ.4.50 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులకు రెండేళ్ల క్రితం శ్రీకారం చుట్టింది. అయితే ఈ పనులు ఆది నుంచీ నత్తనడకన సాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు సక్రమంగా విడుదల కాకపోవడంతో పనుల్లో జాప్యం జరుగుతోంది. గత కొన్ని నెలలుగా పూర్తిగా నిలిచిపోయాయి. పాల్వంచ, కొత్తగూడెం, మణుగూరు మున్సిపాలిటీల్లో రూఫ్ లెవల్ వరకు రాగా.. ఇల్లెందులో మాత్రం పునాది దశలోనే ఉన్నాయి. బిల్లులు రావడం లేదనే నేపంతో కాంట్రాక్టర్లు పనులు ఆపేశారని తెలుస్తోంది.

నిర్మాణం పూర్తయినా నిధులు రాలే..



శ్రీనివాసకాలనీలో పూర్తయిన వైకుంఠధామం

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో మొత్తం ఆరు వైకుంఠధామాల నిర్మాణాలకు 2021లో స్పెషల్ గ్రాంట్ కింద పనులు చేపట్టారు. ఒక్కో వైకుంఠధామానికి రూ.కోటి చొప్పున వెచ్చించారు. పాల్వంచలోని శ్రీనివాస కాలనీ, కేసీఆర్ నగర్, కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ఏరియా, గొల్లగూడెం, ఇల్లెందు, మణుగూరులో నిర్మాణాలు పూర్తి చేశారు. బర్నింగ్ ప్లాట్, సిట్టింగ్ గ్యాలరీ, దింపుడుగల్లం, పూజ గది, ఆఫీస్ గది, బూడిద భద్రపర్చే గది, ఉడ్ స్టోరేజ్, మహిళలు, పురుషులకు వేర్వేరుగా స్నానపు గదులు, దుస్తులు మార్చుకునే గదులు, మండపం, ప్రహరీ, ఆర్చ్, వాచ్‌మెన్ గదులు, శివుడి విగ్రహం, అంతర్గత రోడ్లు, గార్డెన్‌లు, లాన్.. ఇలా అనేక రకాల వసతులతో తీర్చిదిద్దారు. అన్ని చోట్లా నిర్మాణాలు పూర్తయి రెండు సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బిల్లులు విడుదల చేయాలని కోరుతున్నారు.

నిధుల ఆలస్యమే కారణం

ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు విషయంలో జాప్యం జరుగుతోంది. దీంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాలను కాంట్రాక్ట్ తీసుకున్న సంస్థ పనులను మధ్యలోనే నిలిపివేసింది. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే మళ్లీ ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ డీఈ

యాంత్రిక శక్తిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి



ఓసీ–2లో ఉత్పత్తిని పరిశీలిస్తున్న డైరెక్టర్, అధికారులు

మణుగూరు టౌన్: శ్రామికశక్తితో పాటు యాంత్రిక శక్తిని పూర్తి స్థాయిలో వినియోగించుకుంటేనే బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవచ్చని సింగరేణి డైరెక్టర్ ఎన్‌వీకే.ప్రసాద్ తెలిపారు. మణుగూరు ఏరియాలోని ఓసీ–2, ఓసీ–4ను సోమవారం ఆయన పరిశీలించాక ఏరియా ఇన్‌చార్జి జీఎం లక్ష్మీపతిగౌడ్‌తో కలిసి అధికారులతో సమావేశమయ్యారు. వార్షిక లక్ష్యాలను నెలవారీగా బేరీజు వేసుకుంటూ క్రమక్రమంగా ఉత్పత్తి పెంచాలని సూచించారు. సూపర్‌వైజర్లు, కార్మికులు సమష్టిగా కృషి చేస్తూ యంత్ర సామగ్రిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటే నిర్దేశిత వార్షిక లక్ష్యాలను చేరుకోవడం సులువవుతుందని తెలిపారు. వర్షాకాలంలో కూడా బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలగకుండా ఎప్పటికప్పుడు వరదను తొలగించేందుకు మోటార్లను సిద్ధంగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు నర్సిరెడ్డి, శ్యాంసుందర్, రాంబాబు, వీరభద్రుడు, రమణారెడ్డి, లింగబాబు, సురేశ్, చిట్టా శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: హైదరాబాద్‌లోని హకీంపేట తో పాటు ఆదిలాబాద్, కరీంనగర్‌లోని స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యాన మూడంచెల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు మండల స్థాయిలో, 28 నుంచి 29 వరకు జిల్లా స్థాయిలో, ఆతర్వాత జూలై 8నుంచి 12వ తేదీ వరకు రాష్ట్రస్థాయిలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. 1–9–2015 నుండి 31–08–2016 మధ్య జన్మించిన విద్యార్థులకు పోటీలకు హాజరయ్యేందుకు అర్హులని తెలిపా రు. ఎత్తు, బరువుతో పాటు 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800మీటర్ల పరుగు, షటిల్ రన్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, మెడిసిన్ బాల్‌త్రో, వైద్యపరీక్షలు నిర్వహించి అర్హత సాధించిన వారికి స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలు కల్పిస్తామని డీవైఎస్‌ఓ వెల్లడించారు.

క్లుప్తంగా

రామయ్యను దర్శించుకున్న ప్రముఖులు



రామయ్య సన్నిధిలో ప్రభుత్వ సలహాదారులు వేణుగోపాల్‌రావు, తదితరులు

భద్రాచలం/దుమ్ముగూడెం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్‌, కర్ణాటక రాష్ట్ర ఎన్నికల అధికారి డాక్టర్‌ బి.బసవరాజులు విడివిడిగా స్వామి దర్శనానికి వచ్చారు. ఈసందర్భంగా వారికి అర్చకులు సంప్రదాయరీతిలో స్వాగతం పలకగా, ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులు, ఉపాలయాల్లో పూజలు చేశారు. అనంతరం పండితులు వేదాశీర్వచనం చేసి జ్ఞాపికలు అందచేశారు. ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబు, అర్చకులు, పండితులు పాల్గొన్నారు. అలాగే, దుమ్ముగూడెం మండలం పర్ణశాలలో శ్రీ సీతారామచంద్రస్వామి వారిని కర్ణాటక రాష్ట్ర ఎన్నికల అధికారి బసవరాజు కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. స్వామికి పూజలుచేశాక పంచవటీ కుటీరం నారచీరల ప్రాంతాల విశిష్టతను తెలుసుకున్నారు. తహసీల్దార్‌ చంద్రశేఖర్‌, ఆర్‌ఐ లక్ష్మయ్య, సిబ్బంది జయబాబు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి

ములకలపల్లి: మూకమామిడి ప్రాజెక్ట్‌ ప్రదేశాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం ప్రాజెక్ట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన ప్రాజెక్ట్‌ తూములు, కుడి, ఎడమ కాలువలకు మరమ్మతులు చేపట్టాలని, పూడిక తొలగించాలని కోరారు. పార్టీ నాయకులు తాటిపాములు ఐలయ్య, బిజ్జం శ్రీనివాసరెడ్డి, కేసగాని శ్రీనివాస్‌గౌడ్‌, పోనిశెట్టి వెంకటేశ్వర్లు, రాయుడు నాగేశ్వరరావు, భూక్యా రాజేశ్‌, పోలోజు క్రాంతి, రాపాక రమేశ్‌, కటికల రంజిత్‌, గుగులోతు శంకర్‌, శనగపాటి సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

ఇల్లెందు: పురుగుల మందు తాగిన మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. అంబేద్కర్‌ నగర్‌లో నివాసం ఉంటున్న ఎస్‌.రాజేశ్వరి అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో మనస్తాపం చెంది రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్‌ తరలించి వైద్యం అందిస్తుండగా సోమవారం మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హెడ్‌ కానిస్టేబుల్‌ లింగయ్య కేసు నమోదు చేశారు.

జోరుగా నాటుసారా విక్రయాలు



నాటుసారా ప్యాకెట్లు

పాల్వంచరూరల్‌: గుడుంబా విక్రయాలు జోరుగా సాగుతున్నా ఎక్సైజ్‌ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. మండల పరిధిలోని నారాయణ రావుపేట, సంగం గ్రామాల పరిధిలో కొద్దిరోజులుగా ప్యాకెట్లలో నాటు సారా తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. బూర్గంపాడు మండలం నుంచి ప్యాకెట్లు తీసుకొచ్చి ఇంటింటికీ తిరుగుతూ ఒక్కో ప్యాకెట్‌ రూ.20 చొప్పున విక్రయిస్తున్నట్లు సమాచారం. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్‌ అధికారులు మేల్కొని గుడుంబా విక్రయాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

యాప్‌లో ‘వాతావరణం’

- ముందస్తుగా వర్షాలు, పిడుగుపాటు సమాచారం
- పంచాయతీ స్థాయిలో వాతావరణం అంచనా
- వ్యవసాయ, అనుబంధ రంగాలకు ఎంతో ఉపయోగం



భద్రాచలంఅర్బన్‌: ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితుల వివరాలు తెలిపేవిధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దేశంలో వ్యవసాయ రంగా ప్రధానంకాగా, రైతులు వర్షాలు, ఈదురుగాలులు, పిడుగుపాటుతో నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా, వాతావరణంపై ముందస్తుగా అంచనాకు వచ్చేలా పలు యాప్‌లు అందుబాటులోకి వస్తున్నాయి. కేంద్ర వాతావరణ విభాగం (ఐఎండీ) ద్వారా గ్రామ పంచాయతీ స్థాయిలో వాతావరణం అంచనాలు విడుదల చేస్తోంది. స్మార్ట్‌ ఫోన్‌ కలిగి ఉంటే గూగుల్‌ ప్లే స్టోర్‌ నుంచి అయా యాప్‌లు ఇన్‌స్టాల్‌ చేసుకుని వివరాలు తెలుసుకోవచ్చు.

మెసేజ్‌ రూపంలో మేఘదూత్‌



మేఘదూత్‌ యాప్‌ ద్వారా నాలుగు, ఐదు రోజుల వాతావరణ మార్పులు, వర్షసూచిక, ఆకాశం మేఘావృతం అవుతుందా? లేదా.. గాలులు ఏ దిశ నుంచి వీస్తాయి? తేమ శాతం, ఉష్ణోగ్రత వివరాలను తెలుసుకునే అవకాశం ఉంది. వాతావరణ పరిస్థితులపై ఈ యాప్‌ ద్వారా ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఆగ్రో మెట్‌ ఫీల్డ్‌ యూనిట్లు (ఏఎమ్‌ఎఫ్‌యూ) రైతులకు మెసేజ్‌ రూపంలో పంపుతున్నాయి. దీంతో పంట సాగులో విత్తనాలు విత్తడం, ఎరువులు వేయడం, పంట నూర్పిడి సమయంలో నష్టం జరగకుండా చూసుకునే అవకాశం ఉంది.

మెరుపులు తెలిపే దమిని

ఎప్పటికప్పుడు మెరువు హెచ్చరికలను తెలిపేందుకు 'దమిని 'యాప్‌ ఉప యోగపడుతుంది. దీని సాయంతో సమీపంలో 20 కి.మీ పరిధిలో ఐదు నుంచి 20 నిమిషాల వ్యవధిలో ఎక్కడ పిడుగుపడే అవకాశం ఉందో అప్రమత్తం చేస్తుంది. మెరువు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తుంది. పిడుగు పడినప్పుడు అందించాల్సిన వైద్య సాయం గుర్తించి కూడా తెలియజేస్తుంది.

వజ్రపాత్‌తో పిడుగుల సమాచారం

వజ్రపాత్‌ యాప్‌లో రెండు రకాల సమాచారం వస్తుంది. ఎడమ వైపు పిడుగుల సమాచారం కనిపిస్తుంది. అక్కడ మనం ఉన్న ప్రాంతానికి సంబంధించిన మ్యాప్‌ కనిపిస్తుంది. రెడ్‌, ఆరెంజ్‌, ఎల్లో కలర్లలో వలయాలు కనిపిస్తాయి. వీటి పక్కనే 8, 15, 30 అంకెలుంటాయి. ఈ అంకెల ప్రకారం కొద్ది సేపట్లో ఎంత దూరంలో (కి.మీలలో) పిడుగుపడే అవకాశం ఉందనేది చూపిస్తుంది. అలాంటిదేమీ లేకపోతే సమీపంలో పిడుగుపడే అవకాశం లేదనే సమాచారం కనిపిస్తుంది. ఎంత దూరంలో పడుగు పడుతుందో పిన్‌ రూపంలో స్పష్టత ఇస్తుంది. యాప్‌ కుడి భాగంలో పిడుగుపాటు హెచ్చరికలు తెలిపే బటన్‌ ఉంటుంది. దీనిద్వారా ఎప్పటికప్పుడు అప్రమత్తం కావచ్చు.

వర్షం రాకను తెలిపే రెయిన్‌ అలారమ్‌

రెయిన్‌ అలారమ్‌ యాప్‌.. వినియోగదారుడు అందించిన సమాచారం మేరకు అతను ఉండే ప్రాంతానికి సమీపంలో ఎక్కడ వర్షం పడే సూచనలను క్షణాల్లో తెలుపుతుంది. వర్షం ముప్పును గుర్తించి ముందే జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

ఎమ్మెల్యే పాయానికి మాతృవియోగం



రాములమ్మ (ఫైల్‌)

మణుగూరు టౌన్‌: పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తల్లి పాయం రాములమ్మ(85) మృతి చెందారు. మూడు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె సోమవారం ఉదయం తుది శ్వాస విడిచారు. ఈమెకు ఇద్దరు కుమార్తెలు, ముగ్గురు కుమారులు కాగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నాలుగో సంతానం. కాగా ఎమ్మెల్యేను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్యలు ఫోన్‌ ద్వారా పరామర్శించారు. మహబూబాబాద్‌ ఎంపీ పోరిక బలరాంనాయక్‌ ఎమ్మెల్యే పాయంను మణుగూరులోని స్వగృహంలో పరామర్శించారు.

ప్రముఖులు, రాజకీయ నాయకుల నివాళి

రాములమ్మ మృతదేహాన్ని పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేను పరామర్శించారు. నివాళులర్పించినవారిలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, డీసీసీబీ డైరెక్టర్‌ తుళ్లూరి బ్రహ్మయ్య, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, పీసీసీ సభ్యుడు చందా సంతోష్‌, సీపీఐ నేతలు బోల్లోజు అయోధ్య, సీపీఎం, టీడీపీ, బీఆర్‌ఎస్‌ నేతలు, మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, విద్యా సంస్థల నిర్వాహకులు, వివిధ మండలాల కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షులు, ఆదివాసీ, తుడుందెబ్బ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, లారీ అసోసియేషన్‌, మెడికల్‌ షాప్స్‌ అసోసియేషన్‌ బాధ్యులు, మున్సిపాలిటీ అధికారులు, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌ సునీల్‌ ఉన్నారు.



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు



ఎమ్మెల్యే పాయంను పరామర్శిస్తున్న మానుకోట ఎంపీ పోరిక బలరాం నాయక్‌

108 అంబులెన్స్‌లో ప్రసవం

- ఆస్పత్రికి వెళ్తే కాన్పుకు ఇంకా సమయం ఉందని ఇంటికి పంపిన వైద్యులు
- రాత్రి వేళ నొప్పులు ఎక్కువ కావడంతో మళ్లీ ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రసవం

గుండాల: పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణిని గుండాల ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో 108లో ప్రసవించిన సంఘటన సోమవారం జరిగింది. మండలంలోని నాగారం గ్రామానికి చెందిన గర్భిణి కల్తి నవ్య శనివారం ఉదయం పురిటినొప్పులతో బాధపడుతుండగా ఆమె భర్త సురేష్‌ 108 వాహనం ద్వారా గుండాల ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడి వైద్యులు పరీక్షించి నెలలు నిండలేదని, ప్రసవం కాదని కొత్తగూడెం మాతాశిశు కేంద్రానికి రిఫర్‌ చేశారు. 108 ద్వారా కొత్తగూడెం ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఓ ఇంజక్షన్‌ వేయగా నొప్పి తగ్గగా ఇంటికి వెళ్లాలని సూచించారు. అక్కడి నుంచి ఆమె బస్సులో ఇంటికి వచ్చింది. కాగా అర్ధరాత్రి మళ్లీ నొప్పులు మొదలయ్యాయి. దీంతో వెంటనే 108 ద్వారా గుండాలకు తరలించే క్రమంలో నొప్పులు ఎక్కువకాగా కొడవటంచ సమీపంలోనే అంబులెన్స్‌ సిబ్బంది ప్రసవం చేశారు. తల్లీబిడ్డలను గుండాల ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. అయితే పురిటినొప్పులతో మారుమూల గ్రామం నుంచి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని మాతాశిశు కేంద్రానికి పింపిస్తే ఇప్పుడే కాన్పు రాదని, తిరిగి వెనక్కు పంపారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఒక్కరోజు పర్యవేక్షణలో ఉంచాల్సింది పోయి ఇంటికి పంపిస్తే ఇబ్బందులు పడ్డామని వాపోయారు.



అంబులెన్స్‌లో ప్రసవించిన మహిళ

రేషన్‌ బియ్యం స్వాధీనం

దమ్మపేట: అక్రమంగా రేషన్‌ బియ్యం తరలిస్తున్న మినీ ట్రక్కును పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని అల్లిపల్లి చెక్‌పోస్ట్‌ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఏపీలోని ఏలూరుకు అక్రమంగా మినీ ట్రక్కులో 15 క్వింటాళ్ల బియ్యం తరలిస్తుండగా పట్టుకుని, స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేశామని ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

ఇల్లెందులపాడులో చోరీ

ఇల్లెందు: పట్టణంలోని 2వ వార్డు ఇల్లెందులపాడులో ఓ ఇంట్లో చోరీ జరిగిన విషయం సోమవారం వెలుగుచూసింది. ఇల్లెందులపాడుకు చెందిన కొంగర రమేష్‌ ఇంటికి తాళం వేసి బంధువుల ఊరికి వెళ్లారని స్థానికులు తెలిపారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దొంగలు తాళం పగుల కొట్టి బంగారం, నగదు, సామగ్రి అపహరించారని పేర్కొన్నారు.

రెండు బైక్‌లు ఢీ : ముగ్గురికి తీవ్రగాయాలు

మణుగూరు టౌన్‌: మండలంలోని సమితిసింగారం- పీవీకాలనీ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన మణుగూరులో సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. కూనవరానికి చెందిన శ్రీను తన మిత్రుడితో బైక్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో బండారుగూడేనికి చెందిన రాములు బైక్‌పై అతని మిత్రడితో కలిసి వస్తున్నాడు. ఈ క్రమంలో సమితిసింగారం శివారులో రెండు మోటార్‌ సైకిళ్లు అతివేగంగా వస్తూ ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం భద్రాచలం ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి..

దుమ్ముగూడెం : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయపడ్డ సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. మండలంలోని పెద్దనల్లబల్లి గ్రామానికి చెందిన యువకుడు ఊయిక వెంకటేష్‌ ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో మారాయిగూడెం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆర్లగూడెం-లచ్చిగూడెం గ్రామాల మధ్య అటవీప్రాంతంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడటంతో వెంకటేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. 108 సిబ్బంది వెంకట్‌, పవన్‌లు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు.

బైక్‌ను ఆటో ఢీకొని ఒకరికి..

జూలూరుపాడు: మండలంలోని మాచినేనిపేట గ్రామం వద్ద సోమవారం బైక్‌ను ఆటో ఢీకొని ఓ వ్యక్తి గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని గురువాగుతండాకు చెందిన భూక్యా కల్యాణ్‌ బైక్‌పై పడమటనర్సాపురం వెళుతున్నాడు. ఈ క్రమంలో మాచినేనిపేట గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న ఆటో బైక్‌ను ఢీకొట్టింది. దీంతో కల్యాణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని 108 వాహనంలో కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఇసుక లారీ ఢీకొని వ్యక్తి మృతి

కరకగూడెం: వేగంగా వస్తున్న ఇసుక లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పినపాక మండలంలోని గొట్టెల్ల గ్రామం వద్ద సోమవారం జరిగింది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం ప్రకారం.. అశ్వాపల్లి మండలం కిచ్చెనపల్లి గ్రామానికి చెందిన వజ్జ వెంకయ్య (65) గొట్టెల్ల గ్రామంలో బంధువు కర్మకాండలకు వస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామ సమీపంలో రోడ్డు దాటుతుండగా వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో తీవ్ర వెంకయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని 108 ద్వారా భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కాగా మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అర్ధరాత్రి టేకు కలప తరలింపు

- గుండాల అటవీ అధికారులు తరలిస్తుండగా పట్టుకున్న ఇల్లెందు అధికారులు
- సమగ్ర విచారణకు ట్రైనీ ఐఎఫ్‌ఎస్‌ ఆదేశం

ఇల్లెందురూరల్‌: గుండాల మండల అటవీ అధికారులు కలప తరలిస్తుండగా ఇల్లెందు అటవీ అధికారులు అడ్డుకుని యార్డుకు తరలించారు. అయితే ఆ కలప సక్రమంగా తరలిస్తున్నారా? అక్రమంగా తరలిస్తున్నారనే విషయంలో స్పష్టత లేదు. గుండాల మండలం కాచనపల్లి అటవీశాఖ రేంజ్‌ పరిధిలోని పెద్దతోగు అటవీ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న బీట్‌ అధికారి నిర్మల తన బీట్‌ పరిధిలో నేలకూలిన టేకు కలపను సైజులుగా యంత్రంతో కట్‌ చేయించి ఆదివారం ట్రాక్టర్‌లో తరలిస్తోంది. మార్గమధ్యలో అర్ధరాత్రి సమయంలో రెండు చోట్ల ముగ్గురు వ్యక్తులు అటకాయించి సుమారు నాలుగు గంటలపాటు రోడ్డుపైనే నిలిపివేశారు. తిరిగి తెల్లవారుజామున బయల్దేరిన ట్రాక్టర్‌ను కొమరారం డీఆర్‌ఓ సురేష్‌, సిబ్బంది కలిసి కొమరారం గ్రామం వద్ద ఆపి కలప తరలింపునకు డిపార్ట్‌మెంటు జారీ చేసిన పత్రాలు చూపించాలని ప్రశ్నించారు. పత్రాలు లేకపోవడంతో కాచనపల్లి డీఆర్‌ఓ సీతారాములుకు సమాచారం ఇచ్చి, కలపను ఇల్లెందు కలపయార్డుకు చేర్చారు. అధికారులు కొలతలు వేసి యార్డ్‌లో భద్రపర్చారు. కలప విలువ రూ. 1.30 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.



కొలతలు వేస్తున్న సిబ్బంది

అధికారులకు సమాచారం లేకుండా ఎందుకు తరలిస్తున్నట్టు?

కలపను ఏ రూపంలో స్వాధీనం చేసుకున్నా సమాచారం ముందస్తుగా సంబంధిత రేంజ్‌ అధికారి లేదా డీఆర్‌ఓకు తెలపాలి. వారి పర్యవేక్షణలో పీఓఆర్‌ నమోదు చేశాక కలపయార్డుకు తరలించాలి. యార్డ్‌లో కొలతలు వేసి పసుపు రంగులో కలపపై కొలతలు, నంబర్లు ముద్రిస్తారు. కానీ అటువంటి ప్రక్రియ ఏమీ లేకుండా, పై అధికారులకు సమాచారం ఇవ్వకుండా బీట్‌ అధికారి నిర్మల కలపపై ఎరుపు రంగులో నంబర్లు వేసి తరలించడాన్ని అటవీశాఖ అధికారులు తప్పుపడుతున్నారు. కలప తరలింపుపై ముందస్తు సమాచారం లేకపోవడంలో ట్రైనీ ఐఎఫ్‌ఎస్‌, కాచనపల్లి ఇన్‌చార్జి రేంజ్‌ అధికారి రేవంత్‌ చంద్ర విచారణకు ఆదేశించారు. తప్పు జరిగినట్లు నిర్ధారణ జరిగితే చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఇదే విషయమై బీట్‌ అధికారి నిర్మల మాట్లాడుతూ.. తాను కొత్తగా విధుల్లో చేరానని, నిబంధనలు తెలియకపోవడం వల్లే కలపను నేరుగా యార్డ్‌కు తరలిస్తున్నానని, తనను దోషిగా చూపించడం అన్యాయమని పేర్కొన్నారు.

ఎన్డీ నుంచి గోపి బహిష్కరణ

ఇల్లెందు: సీపీఐ(ఎంఎల్‌) న్యూడెమోక్రసీ రాష్ట్రకమిటీ సభ్యుడు గోపి అలియాస్‌ ధనసరి సమ్మయ్యను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌ ప్రకటించారు. ఈమేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన చేశారు. ఎన్డీలో పని చేస్తున్నట్లు నమ్మబలుకుతూనే గోపి పార్టీ అంతర్గత అంశాలను ఇతర పార్టీలకు చేరవేస్తున్నాడని తెలిపారు. నిర్మాణ వ్యతిరేక, విచ్ఛిన్న ముఠా పద్ధతులకు పాల్పడుతున్నండడంతో రాష్ట్ర కమిటీ పదవితోపాటు ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్కరిస్తున్నట్లు వెల్లడించారు.

ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆటో డ్రైవర్‌ నిరసన

టేకులపల్లి: ఫిర్యాదు చేసినా పోలీసులు విచారణలో జాప్యం చేస్తున్నారంటూ టేకులపల్లికి చెందిన ఓ ఆటో డ్రైవర్‌ సోమవారం ఒంటిపై పెట్రోల్‌ పోసుకుని నిరసన తెలిపాడు. మండలంలోని మొక్కంపాడుతండాకు చెందిన గోస రోహిత్‌ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. టేకులపల్లిలో ఆటో సీరియల్‌ విషయంలో మిగతా డ్రైవర్లకు, రోహిత్‌కు తరచూ గొడవలు జరుగుతుండగా, రోహిత్‌ ఆదివారం ఉదయం 8 గంటలకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం తనపై దాడి చేశారని రాత్రి 11 గంటలకు మరోసారి ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారించకుండా ఆలస్యం చేస్తున్నారని పేర్కొంటూ టేకులపల్లి సెంటర్‌లో సోమవారం ఒంటిపై పెట్రోల్‌ పోసుకుని నిరసన తెలిపాడు. బ్లూకోల్ట్‌ కానిస్టేబుల్‌ వచ్చి స్టేషన్‌కు తరలించగా, హెడ్‌ కానిస్టేబుల్‌(ఎస్‌హెచ్‌ఓ) నరసింహారావు పూర్వాపరాలు పరిశీలించి ఆటో డ్రైవర్లు సురేష్‌, చందులపై కేసు నమోదు చేశారు.